# 6. బుజ్జి మేక

ఎర్ర ధూళిని రివ్వున రేపుగుంటూ మందల వేళప్పుడు మేకల మందొకటి రాజుగారి తోట పక్క నుంచి వెళుతోంది. ఓ బుజ్జిమేక హఠాత్తుగా ఆగిపోయింది. అది నేల మీద నున్న ఒక్కగానొక్క వేప కొమ్మ రెమ్మను చూసింది. ఆ రెమ్మను నోటితో అందుకుంది. పక్కకు తిరిగిపోయింది. విలాసంగా ఆ లేత రెమ్మను నములుతోంది. అలా నముల్తూ పక్కకు మెడ వంచింది. రాజుగారి తోటలోకి తొంగి చూస్తూ నిల్చుంది.

అంతట్లో ఆ మంద వెళ్లిపోయింది. ఆ బుజ్జిమేక కోసం ఆగకుండా వెళ్లిపోయింది. ఆ మేక ఆ మంద అలా వెళ్లిపోడం చూడ్లేదు. ఆ మేకల కాపరి కూడా ఆ బుజ్జిమేక అలా వుండిపోడం చూడ్లేదు. మందకి ముందే నడుస్తున్న మంద బేపి కూడా, అది గుర్తించలేదు.

అంతలో రాజుగారి తోటద్వారం తెర్చుగుంది. ఆ బుజ్జిమేక తీక్షణంగా ఒక్క క్షణం వీక్షించింది. రాజుగారి తోట్లోకి ప్రవేశించింది.

ఆ తోటలో విరబూసిన పూలమొక్కలు చూసింది. సుగంధాల్ని వెదజల్లుతున్న, రంగు రంగుల పువ్వులు చూసింది. పచ్చ పచ్చగా, పరువంగా వున్న ఆకులు తిలకించింది. నాలుగు ఆకులు నోట్లో వేసుగుంది. చెంగున నాల్గు గెంతులు గెంతి, ముందుకు పోయింది. అక్కడ బాగా పెరిగి, పెనవేసుగున్న లతలు చూసింది. అవి పిల్ల గాలిలో, మెల్లగా కదుల్తూ పల్లవి పాడుతున్నాయ్. శృంగారంగా, నృత్యం చేస్తున్నాయ్. ఆ మేక ఆలతా పత్రాల్ని లలితంగా నోట్లోకి లాక్కుంది. పొట్టి తోకను ఉల్లాసంగా కదుపుతూ, కొంచెం ముందుకుపోయింది. అక్కడ ఫలభరితమైన వృక్షాలు చూసింది.

ఆ లతల మధ్య-ఆ తరుల మధ్య-ఓ తరుణి నగ్న శిల్పాన్ని చూసింది. ఆ శిల్పం ఎత్తయిన పాలరాతి పలక మీద వుంది. వీలయినంత గంభీరంగా - వీలయినంత రాజఠీవితో - గెంతి ఆ పాలరాతి పలక మీద నిలబడింది. పొడవైన మెడను వీలయినంత పైకెత్తి చూసింది.

కనుచూపు మేరలో, ఆ మేకల మంద కనబడలేదు. ఆ మేకకు తండ్రి ఎవడో తెలీదు. తల్లి పాలివ్వడం మానేసి చాలా కాలమయింది. అంచాత తల్లిని మర్చిపోయింది. అంచాత, ఆ మేక తల్లిదండ్రుల కోసం పరితపించలేదు. అయితే ఆ మందతో మాత్రం కలిసిపోవాలని తీవ్రంగా చూస్తోంది. తీక్షణంగా వీక్షిస్తోంది. కంగారు పడుతోంది. చాలా ఆత్రుతగా ఆ మేక, మేకలా

అరుస్తోంది. అటూ-ఇటూ అరుచుగుంటూ తిరుగుతోంది. అంతలో-పచ్చని కోమల పత్రాలు గాలికి వూగుతూ వూగుతూ ఆ బుజ్జిమేకను ఆకర్షించాయ్. అంచాత అది మరో నాల్గు అకులు నోట్లో వేసుగుని - విలాసంగా తింటూ - మైమరిచి పోయింది.

ఆ తోటచుట్టూ విశాలమైనదే గాకుండా ఎత్తయిన గోడను చూసింది. ఇది ఎవరు కట్టారు చెప్మా అని అనుకుంది. చెంగున మరో గెంతు గెంతి, ఆ పక్కనే వున్న బావి దగ్గరకు వెళ్లింది. ఆ బావి గోడల మీద నిలబడింది. లోనికి చూసింది. ఇంతలోతు నుయ్యిని ఎవరు తవ్వేరు చెప్మా అని కూడా అనుకుంది.

ఆ తర్వాత ఆ విరబూసిన పువ్వులు చూసింది. అలా చూసి, ఆ పువ్వులెవరి శిరస్సులు అలంకరిస్తాయ్ చెప్మా అని ప్రశ్నించుకుంది. అలాగే ఆ ఫలభరిత తరులు చూసింది. ఆ పళ్లు ఎవరారగిస్తారు చెప్మా అని కూడా ప్రశ్నించుకుంది.

అలా కొంచెం ముందుకి వెళ్లి, ఠీవిగా ఒక దివ్య భవనాన్ని అక్కడ చూసింది. దాన్ని ఎవరు కట్టేరు చెప్మా అని ప్రశ్నించుకోలేదు. అయితే-ఆభవనంలో ఎవరుంటున్నారు చెప్మా అని సూటిగా ప్రశ్నించుకుంది.

అప్పుడా మేక తలెత్తి, ఆ భవనం మేడవేపు చూసింది. అప్పుడే ఆ మేకను ఆ మేడ మీద నుంచి, ఆ రాజుగారి భార్య చూసింది. చలాకీగా గెంతులు వేస్తున్న ఆ బుల్లి మేకను ఆమె చమత్కారంగా చూసింది. అలా చూసి, ఆమె మురిసిపోయింది. ఆమె వెంటనే నెమ్మది నెమ్మదిగా అడుగులు వేసుగుంటూ ఆ మేకను సమీపించింది. చేతులు చాచి, మృదువుగా పిలిచింది. ముసిముసిగా నవ్వింది. ఆమె నవ్వులు వెన్నెల జల్లులు కురిసాయ్. అయినా - నీ చేతుల్లో చిక్కకోడానికి నేను రాజుననుకున్నావా - అని కోప్పడినట్లు, అది తుర్రున పారిపోయింది. గుబురు గుబురుగా పెరిగిన లతల్లో దూరి, దాగుంది.

అప్పుడా లతాంగి బుజ్జిమేక కోసం లతల్లో దూరింది. అప్పుడు గులాబిముళ్లు ఆమె చెక్కిలికి గుచ్చు గున్నాయ్. రక్తం చిమ్ముతోంది. అప్పుడు ఆమెకు కోపం వచ్చింది. వెంటనే గిర్రున తిరిగి వెళ్లిపోయి, రాజుతో చెప్పింది.

ఆమె చెక్కిలి మీద రక్తంచూసిన రాజుగారు కోపంతో మండిపోయారు. అప్పుడాయన హుందాగా, రాజఠీవితో, ఆ మేకను సమీపించారు. శౌర్యంతో చేతులు విసిరారు. ముందుకు పరాక్రమంతో దూకారు.

నీ చేతుల్లో చిక్కడానికి, నేను రాణీననుకున్నావా అన్నట్లు ఆ మేక గబుక్కున గెంతి, పొట్టి తోకను వీలయినన్ని ఎక్కువసార్లు, వీలయినంత వేగంతో ఆడించి, అరుస్తూ పారిపోయి పొదల్లో నక్కింది.

రాజుగారికి కోపం వచ్చింది, పౌరుషం వచ్చింది, శౌర్యం వచ్చింది, రాజసం రంజిల్లింది. వెంటనే మత్తేభంలా హుంకరించి, మేక మీదకు ఉరికారు. పాము కుబుసంలాంటి సన్నగా,మెత్తగ వుండి,పాములా అతడి మెడలో వున్న సిల్కు కండువా, జరజర జారి-ఆయన కాళ్లల్లో పడిచుట్టుకుంది. వెంటనే బోర్లా పడిపోయారు.

అప్పుడు ఆయన అహంకారం ఆకాశాన్ని అంటింది. శౌర్యం చంద్రుణ్ని తాకింది.

'ఓరి మేక ఎదవా! ఎక్కడ సచ్చావురా!' అని ఆయన ఆలస్యం చేయకుండా, తోటమాలిని కేకవేసారు.

ఆ కేకవిని, అతడు అంగలు వేసుగుంటూ వచ్చాడు. 'ఏటి బాబూ! ఏటయ్యిందేటి!' అని అతివినయంగా అడిగాడు.

'సూడ్రా! ఆ మేకను సూడ్నేదట్రా! ఈఒనం-ఈతోట-దానిసొంతవనుకుందేటో - సొంతవయినట్లే తిరిగేస్తంది! మేకని ఒగ్గేసినావంటే, మెకనై నెత్తి ఎక్కుతాది! మేక ఎదవల్ని కొందర్ని కనికరించి, మాసెడ్డ దెబ్బతిన్నాను! ఆయాల్టినుంచీ, కనికరించడం కసాయిప్పనని తెల్సుగున్నాను! ఎక్కడోణ్ని అక్కడ నొక్కివుంచడం అవసరమని ఆయేలే తేల్సేసినాను! అంచాత,సెవుట్టుగుని ఆమేకను ఈడ్చుకురా!' అని రాజుగారు ఆజ్ఞలు జారీ చేసారు.

ఆ పనివాడు లేత వేప కొమ్మలు పట్టుగున్నాడు. మేక అరుపుల్ని అరుచుగుంటూ, వేప కొమ్మలు వూపుతూ, మచ్చికతో మేకను సమీపించాడు.

ఆ గుంట మేక, నల్ల మేకలా నల్ల నల్లగా వున్న అతణ్ని చూసింది. మేక గెడ్డంలా గెడ్డం వున్న అతణ్ని సమీపించింది.

' వీడు మేకగాడే! నాలాటి వాడే!' అన్నట్లు అరుపులతో పలకరించింది.

అప్పుడు అతడు ఆ మేకను చేతుల్లోకి తీసుగుని, చంకన ఎత్తుగున్నాడు. లేత వేప కొమ్మలు తినిపిస్తూ, రాజుగారి దగ్గరకు తీసుకువెళ్లాడు.

అలా ఆ అసామీ ఆ మేకను రాజుగారికి అప్పగించి వెళ్లిపోయాడు. ఆ రాజుగారు ఆ మేకను రాణీగారికి అర్పించాడు. ఆ రాణీ ఆ మేకతో ఆడుకుంది. ఆ కుర్ర మేక చెవులు గిర్రున తిప్పుతూ, కిర్రెక్కిపోయింది.

అసలే అది నోరులేని మేక. దాన్ది మేకబతుకు. దాన్ది దీన జీవితం. అది పీడిత ప్రాణి-నక్క వాత పడ్డ మేకలా అది గింజుకుంటోంది.

అప్పుడా గుంట మేక గంభీరరూపం దాల్చింది. 'ఏడీ ఆ మేకగాడు!' అని తల పై కెత్తి చూసింది. అలా చూసి 'ఏడీ ఆ మేక గాడు! ఎవరి సౌభాగ్యం కోసమో-ఎవరి సౌఖ్యం కోసమో - నన్ను హింసలపాలు చేసాడు! ఆ సంగతి వాడికి చెప్పాలి' అని, అలా చెప్పడానికే అన్నట్లు, వీలయినంత

గంభీరంగా, ఆ రాణీగారి ఒళ్లో వెనక కాళ్ల మీద నిలబడి ముందు కాళ్లు పైకెత్తి, ముందుకు దూకి, మరింత గంభీరంగా అరిచింది.

అప్పుడా రాణీగారు, వంటవాణ్ని పిలిచారు, ఆవంటవాడు మొదటదాన్ని బంధించాడు. ఆ తర్వాత వధించాడు. ఆ పిమ్మట చిత్రవధ చేసాడు. ఆ తర్వాత, ఉడకేసి, సుపక్వంచేసి, సురుచిర భక్ష్యంగా చేసాడు.

రాజుగారూ-రాణీగారు, శృంగార సంగీతం వింటూ, విలాసంగా భక్షించారు.

* * *

ఆ మేకల కాపరి ఆ సాయంకాలయం మేకల్ని దోడ్లో పెట్టేముందు లెక్కచూసాడు. బుజ్జిమేక తప్పిపోయిందని తెల్సుగున్నాడు. ఆ వేళ ఆ మంద తిరిగిన జాగాలన్నీ వెదికి వెదికి వేసారిపోయాడు. ఏ నక్కా తన బుజ్జిమేకను మేసీలేదని తేల్చుగున్నాడు.ఎవడో మనిషి మెకవే బుజ్జిమేకను పొట్టన పెట్టుగున్నాడని కూడా నిర్ధారించుగున్నాడు.

'రేపో-మాపో ఆ మెకం గోడు దొరక్కపోతడేటి? దుమ్ము లేరీనేటి!!' అని అనుకుని ఛాతి చరుచుకున్నాడు.

(జ్యోతి-మాసపత్రిక-మే, 1970)